




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 8 సంచిక : 349

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 2 మే 2025


## పరిశ్రమల ఏర్పాటు ఆలోచనతో రండి

● మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుంది ● ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారుచేయాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం ● 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు ● ఇచ్చిన మాట ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం ● భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని కల్పిస్తాం ● గత పాలకుల నిర్వాకంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి ● మొదటిసారి కేంద్రం కుల గణన చేపడుతోంది ● -సీఎం చంద్రబాబు నాయుడు ● ఆత్మకూరు నియోజకవర్గం నెల్లూరుపాలెంలో పేదల సేవలో పాల్గొన్న సీఎం ● మే డే సందర్భంగా భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి ● నారంపేటతో పాటు మరో 10 MSME పార్కులు వర్చువల్ గా ప్రారంభం ● త్వరలో దగదర్తి విమానాశ్రయం పనులు చేపడతామని సీఎం వెల్లడి







**నెల్లూరు జిల్లా, ఆత్మకూరు,కలంకౌంటర్ :** ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారుచేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని అందులో భాగంగానే 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత పాలకుల నిర్వాకంతో భవన నిర్మాన కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం తెలిపారు. మే డే సందర్భంగా నెల్లూరు జిల్లా నారంపేటతో పాటు మరో 10 చోట్ల MSME పార్కులు ముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకుముందు ఆత్మకూరు మండలం నెల్లూరుపాలెం గ్రామం ఎస్టీ కాలనీలో చలంచర్ల సుస్మితకు వితంతు పింఛన్‌ను సీఎం స్వయంగా అందించారు. టీటీసీ చదివిన సుస్మితకు డీఎస్సీలో ఉద్యోగం కొరకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. సుస్మిత ఐదేళ్ల కుమార్తె చైత్రికను గురుకుల పాఠశాలలో చేర్పించి చదువు చెప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పేదల సేవలో కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి మ-ఖ్యమంత్రి మాట్లాడారు.

**ఇంటికో ఎంట్రపెన్యూర్‌ని తయారు చేస్తాం..** నారంపేటలో ఒక మంచి కార్యక్రకమానికి శ్రీకారం చుట్టాం. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ ఎంఈ పార్కులు ఏర్పాటు చేయబోతున్నాం. ఎవరైనా సరే నేరుగా వచ్చి ఫ్యాక్టరీ పెడితే చాలు. మిగిలిన కరెంటు, షెడ్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాలన్నీ ఇక్కడ మేమే కల్పిస్తాం. ఆనాడు తెలుగువారికి ఒక మహా నగరం ఉండాలి, సంపద రావాలని హైదరాబాద్ ను అభివృద్ధి చేశాం. ఇపుడు అమరావతిని నిర్మిస్తున్నాం. ఎంఎస్ ఎంఈ పార్కుల ఏర్పాటుకు రైతాంగం సహకారం ఎంతో ముఖ్యం. మొత్తం 40 నియోజకవర్గాల్లో మొదటి దశలో ఎంఎస్ఎంఈ పార్కులు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నియోజకవర్గానికో %మీూవీజు% పార్కుతో మొత్తం రూ.2,000 కోట్లకు పైగా పెట్టుబడులు కార్యరూపం దాల్చనున్నాయి. 2027%-%28 ఆర్థిక సంవత్సరానికి 15,000 MSME యూనిట్లు నెలకొల్పేలా చూడటం ద్వారా 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాము.

**రైతులూ పారిశ్రామికవేత్తలు కావొచ్చు ..** 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నాం. ప్రభుత్వంపై నమ్మకంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. దీనివల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకోవాలి. రైతులూ పారిశ్రామికవేత్తలుగా తయారుకావాలి. రైతులు

- 3లో

## వేసవి నీటి ఎద్దడి సవాళ్లను ప్రణాళికాబద్ధంగా అధిగమిద్దాం

● నీటి కొరత ఉన్న ప్రాంతాలను మ్యాపింగ్ చేయండి ● తాగు నీటి సరఫరాపై రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వార్ రూమ్స్ ఏర్పాటు చేయాలి ● ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్







**మంగళగిరి,కలంకౌంటర్ :** గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో ఎదురయ్యే తాగు నీటి సరఫరా సవాళ్లను ఎదుర్కొనేందుకు అధికారులు పూర్తి స్థాయి సంసిద్ధతతో ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నీటి సంరక్షణ పట్ల ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని చెప్పారు. తాగు నీటి సరఫరాపై రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక వాటర్ వార్ రూమ్ లు ఏర్పాటు చేసి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోజువారీ నీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడిపై గురువారం మంగళగిరిలో ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఒక్క చుక్క వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి. వర్షపునీటి సేకరణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి. ఇంటింటికీ, కమ్యూనిటి భవనాలకు వర్షపు నీటి హార్వెస్టింగ్ పద్ధతులు ఏర్పాటు చేయాలి. తాగు నీటి అవసరాల కోసం, భవిష్యత్తు తరాల కోసం నీటి నిల్వను పెంచేలా చర్యలు

- 2లో

## ప్రధానమంత్రి అమరావతి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి








**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభానికి విచ్చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని మంత్రుల బృందం వెల్లడించింది.ప్రధాని పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించబడిన పయ్యావుల కేశవ్,పి.నారాయణ,కొల్లు రవీంద్ర,నాదెండ్ల మనోహర్ లతో కూడిన మంత్రుల బృందం గురువారం సభా వేదిక ప్రాంగణంలో సంబంధిత అధికారులతో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించింది. అనంతరం ప్రధాన సభా వేదికను వారు పరిశీలించి తుది దశకు చేరుకున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.ఈసందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాని స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుండి ప్రజలు తరలి రానున్నారని వేసవి దృష్ట్యా సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని ఆప్రకారం విస్తృతమైన ఏర్పాట్లు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు.ప్రతి బస్సుకు

- 2లో







# మాజీ సి ఎం జగన్ ను కలిసిన వెలంపల్లి



**తాడేపల్లి,కలంకౌంటర్ :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ని గురువారం తాడేపల్లి లో మర్యాదపూర్వకంగా కలిశారు.

# పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికే పెన్షన్లు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి,కలంకౌంటర్ :** పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఉదయం కొర్లగుంట సంజయ్ గాంధీ కాలనీలోని రామాలయం వద్ద 8,9 డివిజన్లకు సంబంధించిన లబ్దిదారుల ఇంటింటికి వెళ్ళి పెన్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పెన్షన్ ఇచ్చి మాట నిలుపుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకే దక్కిందని అన్నారు. తిరుపతిలో 18,666 మంది పెన్షనర్స్ కు ఎనిమిది కోట్ల ఇరవై లక్షల పదకొండు వేల ఐదు వందల రూపాయలు అందించినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో రెండు వేల నుంచి మూడు వేలు పెంచడానికి ఐదేళ్ళు పట్టిందని ఆయన విమర్శించారు. బటన్ నొక్కుడు పేరుతో సగం మందికి పెన్షన్లను ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. పేదలందరికి ఆర్థిక తోడ్పాటు అందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట



**పొన్నలూరు,కలంకౌంటర్ :** పొన్నలూరు మండలం నాగిరెడ్డి పాలెం గ్రామంలో గురువారం 21 అడుగుల ఏకశిలా అభయాంజనేయ స్వామి ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డిపాలెం గ్రామం లో బంధువులతో పండుగ వాతావరణం నెలకొంది. రామనామ స్మరణతో ప్రతిష్ట ప్రాంగణం మార్మోగింది. కాషాయ జెండాలతో గ్రామం కాషాయమైంది. హనుమాన్ చాలీసా పారాయణం, రామనామ స్మరణల మధ్యన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. విగ్రహ ప్రతిష్ట అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించి, స్వామివారిని అలంకరించారు. శనివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా చంద్రబాబు పాలన

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత







**ఇబ్రహీంపట్నం,కలంకౌంటర్ :** కార్మికుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, తన కుటుంబ సభ్యుల మాదిరిగా కార్మికుల బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన మే డే ఉత్సవాల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. సంపద సృష్టికి మూలమైన కార్మికుల క్షేమం, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలోని నాలుగు ఈఎస్ఐ ఆసుపత్రులను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కార్మికుల ఆరోగ్య భద్రత, కాలుష్య నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, దీనిలో భాగంగా ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలపై థర్డ్ పార్టీతో ఆడిట్ చేయిస్తున్నామని తెలిపారు. ఇబ్రహీంపట్నం థర్మల్ విద్యుత్ ప్లాంట్ (వీటీపీఎస్) కాలుష్యం నియంత్రణతో పాటు ప్లాంట్ నుంచి విడుదలయ్యే కాలుష్య కారకాలను తగ్గించడానికి రూ.600 కోట్లతో ప్రణాళికలు రూపొందించామన్నారు.

**వీటీపీఎస్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి..** వీటీపీఎస్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా కృషిచేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. కార్మికుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టి తీసుకెళతామన్నారు. గతంలో ఇదే పరిశ్రమలో నాలుగు వేల మందికిపైగా కార్మికులను రెగ్యులైజ్ చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు.

**'ఉచిత ఇసుక'తో భవన కార్మికులకు ఆర్థిక భద్రత..** గత జగన్ ప్రభుత్వ అసమర్ధ కారణంగా ఎన్నో పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలిపోయాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. ఇష్టారాజ్యంగా అప్పులు చేయడంతో, రాష్ట్రం ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిశ్రమల స్థాపనకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యం భవన నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టిసారించి, ఉచిత ఇసుక అందజేస్తున్నామన్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులకు నిత్యమూ ఉపాధి లభించే అవకాశం కలిగిందన్నారు. అనంతరం వీపీటీఎస్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి మంత్రి సవితకు వినతి పత్రమందజేశారు. కూటమి నాయకులు, తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం సంఘ నాయకులు మంత్రి సవితను ఘనంగా సత్కరించారు.

అంతకుముందు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

**పెన్షన్ల పంపిణీ....** అనంతరం పట్టణంలోని గొల్లపూడి లో మంత్రి సవిత, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. గొల్లపూడి కరకట్టకు ఇరువైపులా ఉన్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్లు అందజేశారు.

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మ్మాట్లాతూ, తమది కార్మిక పక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ ఇన్చార్జి గాంధీ, ఇతర కూటమి నేతలు, భారీ సంఖ్యలో వీటీపీఎస్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# పెద్ద మొత్తంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం

-మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**ప్రకాశం / సింగరాయకొండ,కలంకౌంటర్ :** ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం నాడు ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మంత్రి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో నిర్మించిన బీచ్ సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...కూటమి 10 నెలల పాలనలోనే రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. దేశంలోనే పెద్ద మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీనే. ప్రతి నెలా రాష్ట్రంలో 63 లక్షల మందికి రూ. 2,717 కోట్లు, ప్రకాశం జిల్లాలో రూ. 2 లక్షల 83 వేల మందికి రూ.123 కోట్లు పంపిణీ చేస్తున్నాం. పింఛన్ రూ.200 నుంచి రూ.2 వేలకు, రూ.2 వేలను రూ.4 వేలకు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుదే. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. పింఛన్ రూ 4 వేలకు పెంచాం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. మత్స్యకారులకు వేట నిషేధ కాలభృతి రూ.10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచాం. ఎస్సీ, బీసీలకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు, ఎస్టీలకు రూ.3.25 లక్షలు ఇవ్వబోతున్నాం. చేపల చెరువుల రైతులకు రూ.1.50 పైసల సబ్సిడీకి విద్యుత్ ఇస్తున్నాం, మత్స్యకారులకు వలలు, డీజిల్ సబ్సిడీకి అందజేశాం. సోనా బోట్ల వివాదంలో తమిళనాడు ప్రభుత్వం ముందుకు వచ్చి అక్రమంగా ఏపీలోకి ప్రవేశించిన బోట్లపై కేసులు పెడతామని తెలిపింది. ఇది కూటమి ప్రభుత్వం సాధించిన విజయమని మంత్రి తెలిపారు. రేపటి నుంచి అమరావతిలో నూతన అధ్యాయం ప్రారంభమవుతుందని, ప్రధాని మోదీ అమరావతిలో వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు మంత్రి డోలా తెలిపారు. తెలుగువారు గర్వపడేలా అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్ధవంతమైన నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

# బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల దీపప్రజ్వలన



**కందుకూరు,కలంకౌంటర్ :** సరోజినీ దేవి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సర విద్యార్థుల దీపప్రజ్వలన కార్యక్రమం గురువారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డా. కె. విజయ శ్రీనివాస్, ఆయన సతీమణి కె. ఇంద్రా దేవి, కళాశాల ప్రిన్సిపల్ డా. సి.హెచ్. రవికుమార్ వైస్ ప్రిన్సిపల్ వి. హరిబాబు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి డా. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఇది సేవామూల్యాలపై ఆధారపడిన జీవిత విధానం అని పేర్కొన్నారు. నర్సింగ్ విద్యార్థులు తమ భవిష్యత్తు పట్ల నమ్మకంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నర్సింగ్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉత్తమ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.కె. ఇంద్రా దేవి మాట్లాడుతూ, నేటి సమాజంలో కారుణ్యం చాలా కొరవడిందని, ప్రతి నర్సింగ్ విద్యార్థి ఇతరుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, నర్సింగ్ సేవల్లో అగ్రగామిగా నిలిచిన ఫ్లోరెన్స్ నైటింగేల్ ను ఆదర్శంగా తీసుకొని, ఆమె నిబద్ధతను ప్రతీ విద్యార్థి అనుసరించాలన్నారు. ప్రిన్సిపల్, నర్సింగ్ కళాశాల హెడ్ పి. జ్యోతి మాట్లాడుతూ, తమ సంస్థ విద్యార్థుల్లో క్షమ, సహనం, సేవా ధృక్పథం వంటి విలువలను నూరిపోస్తుందని తెలిపారు. నర్సింగ్ వృత్తిని ఒక కళగా అభివర్ణిస్తూ, ఇది శ్రద్ధ, క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వృత్తి అని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ స్టాఫ్, విద్యార్థులు డా. కె. విజయ శ్రీనివాస్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు పురస్కారాలను ముఖ్య అతిథులు అందజేశారు.

# దుర్గమ్మ ఆశీస్సులతో అమరావతి పునర్ నిర్మాణ పనులు విజయవంతం కావాలి

- ప్రధాని మోదీ అమరావతి పర్యటన భావితరాలకు భవిష్యత్తు కావాలి.
- ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో అమరావతి.. పోలవరం పూర్తి కావాలి
- విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ

**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో అమరావతి పునః నిర్మాణ పనులు విజయవంతం కావాలని, అమరావతి పునః ప్రారంభ పనులకు శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారని, ఏపీలో ప్రధాని మోదీ పర్యటన విజయవంతం కావాలని దివంగత సీఎం, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) తనయుడు రామకృష్ణ ఆకాంక్షించారు. అమరావతి పున: ప్రారంభ పనుల శంకుస్థాపనలో పాల్గొనేందుకు గురువారం విజయవాడ వచ్చిన రామకృష్ణ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు రామకృష్ణకు అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించి అమ్మవారి శేషవస్త్రాలతో రామకృష్ణను సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజారాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులకు మోదీ శుక్రవారం అమరావతికి వస్తున్నారని, ఆయన పర్యటన విజయంతం కావాలని అమ్మవారిని కోరుకున్నానన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో రాజధాని నిర్మాణం పూర్తి కావాలని, ఏపీ ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని, తద్వారా ఏపీ అన్నపూర్ణగా రూపుదిద్దుకోవాలని, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. తెలుగుదేశం పార్టీ, తమ తండ్రి ఎన్టీఆర్ ఆశయాల సాధనకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వంలో ఏపీ అన్నివిధాలా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకుని శిక్షిస్తాం: అమిత్ షా



**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** ఉగ్రవాదాన్ని అంతం చేసేంతవరకూ తమ పోరాటం కొనసాగుతుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గురువారం పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా వెతికి పట్టుకుని శిక్షిస్తాం అమిత్ షా వెల్లడించారు. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయమని అమిత్ షా తెలిపారు. దాడిని చేసి తప్పించుకున్నాం అని అనుకుంటే అది పొరపాటేనని అన్నారు. ఇది మోదీ సర్కార్ అని.. దాడికి కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని అమిత్ షా పేర్కొన్నారు.

# వేసవి నీటి ఎద్దడి సవాళ్లను ప్రణాళికాబద్ధంగా అధిగమిద్దాం

- ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలి. ఉపాధి హామీ పథకం ద్వారా వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రతి గ్రామంలో ఫిల్టర్ బెడ్లను పరిశీలించి, అవసరమైన మరమ్మత్తులు చేసి శుద్ధమైన నీటిని ప్రజలకు అందించే ఏర్పాటు చేయాలి. ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పని చేస్తున్నాయా.? లేదా అనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించాలి. వాటర్ టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా నీటి నమూనాలను పరీక్షించి ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలి. ప్రజలు మన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కాకుండా చూడాలి. పారదర్శకతతో కూడిన ప్రణాళికలు అమలు చేయాలి. నీటి పరిరక్షణపై పాఠశాల, కాలేజీ విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రచారం చేయాలి. ప్రకృతి నుంచి వచ్చే ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకునే ఏర్పాటు చేయాలి. వేసవిలో విద్యార్థులకు, యువతకు నీటి సంరక్షణలో అవగాహనా కార్యక్రమాల్లో భాగం చేసే విధంగా మన ప్రణాళికలు ఉండాలి. వారికి వేసవి ఇంటర్న్ షిప్ ద్వారా గౌరవ వేతనాలు, సర్టిఫికెట్లు ఇచ్చి ప్రోత్సహించాలి నీటి సంరక్షణ, నీటి వనరుల పర్యవేక్షణ తాగునీటి సమస్యలను ఎదుర్కొనే ప్రక్రియలో వీరి సహకారం తీసుకుందాం. వేసవిలో నీటి ఎద్దడి నుంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైతే నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ప్రతి ఇంటికి సరఫరా చేయాలి. ప్రతి ఒక్కరు బాధ్యతగా నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలి. గ్రామ గ్రామానికి ప్రత్యేకమైన సమగ్ర తాగునీటి ప్రణాళిక రూపొందించాలి" అన్నారు.

# ప్రధానమంత్రి అమరావతి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రభుత్వ అధికారిని ఇన్చార్జిగా పెట్టడంతో పాటు 25 బస్సులకు ఒక ప్రత్యేక ఇన్చార్జి అధికారిని నియమించి ఎక్కడా ఎటువంటి ఆటంకం కలగకుండా సభా స్థలికి చేర్చే విధంగా తగిన ఏర్పాట్లు చేశామని అన్నారు. బస్సులు బయలుదేరే సమయంలోనే అల్పాహారం,తాగునీరు,దారి మధ్యలో మధ్యాహ్న భోజనం కల్పించడంతో పాటు సభా ప్రాగంణంలో ఏర్పాటు చేసిన వివిధ పార్కింగ్ ప్రాంతాల్లో కూడా భోజన వసతి కల్పించడమేగాక సభానంతరం తిరిగి వారి గమ్యస్థానాలకు బయలుదేరే ముందు రాత్రి భోజనం కూడా అందించడం జరుగుతుందన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు.రాజధాని కార్యక్రమం మనది అనే భావన అందరిలో కలిగేలా తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి 29 గ్రామాల ప్రజలు సుమారు 34వేల ఎకరాలను ఇచ్చారని వారందరినీ ఈకార్యక్రమంలో పెద్దఎత్తున భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణంతో ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని ఆదిశగా పెద్దఎత్తున అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.ఇప్పటికే సభా ప్రాంగణంలో ఏర్పాట్లన్నీ పూర్తి కావడం జరిగిందని మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభానికి విచ్చేయుచున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడి వారి కార్యక్రమానికి సంబంధించి గతంలో ఎన్నడూ లేని రీతిలో అద్భుతమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు.అమరావతి రాజధాని మనది అనే భావన అందరిలో కలిగి అన్ని నియోజకవర్గాల నుండి ప్రజలు ఈకార్యక్రమంలో భాగస్వాములు కానున్నారని తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖామాత్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి 29 గ్రామాలకు చెందిన రైతులు 34వేల ఎకరాలను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇస్తే గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడి అమరావతి రాజధానిని సర్వనాశనం చేశారని అన్నారు.మరలా అమరావతి రాజధాని పనులను తిరిగి ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. అనంతరం ప్రధాని సభ ప్రధాన వేదిక,అమరావతి రాజధాని పైలాన్ తదితర ఏర్పాట్లను మంత్రుల బృందం పరిశీలించింది. ఈకార్యక్రమంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల రాష్ట్ర నోడలు అధికారి జి.వీరపాండ్యన్,సియం కార్యదర్శి ప్రద్యుమ్న,గుంటూరు జిల్లా కలక్టర్ నాగలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటు ఆలోచనతో రండి

● గత పాలకుల నిర్వాకంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి ● మొదటిసారి కేంద్రం కుల గణన చేపడుతోంది -సీఎం చంద్రబాబు నాయుడు







(మొదటిపేజీ తరువాయి)

కూడా ఎంఎస్ ఎంఈ పార్కులు పెట్టవచ్చు. అందుకు అవసరమైన అనుమతులు ఇస్తాం. పదెకరాల్లో నానో పార్కు, వందెకరాల్లో ఎంఎస్ఎంఈ , వంద ఎకరాలకు పైగా ఉంటే మేజర్ పార్కులు ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే ఆడబిడ్డలు కూడా ఇండస్ట్రీలు పెట్టి ఆర్థికంగా బలోపేతం కావాలి.

**కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకుంటాం..** మన దేశంలో 85 శాతం అసంఘటిత కార్మికులే ఉన్నారు. అందులో 65 శాతం వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. కేంద్రం నరేగా ద్వారా పేదలకు 100 రోజులు పనిచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భవన నిర్మాణ కార్మికుల కష్టాలు నేను స్వయంగా చూశాను. మండుటెండలో ఇనుప రాడ్లతో వారు పనిచేస్తారు. వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే. కార్మికుల్లో 56 శాతం మహిళలే ఉన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం జెండాలో కార్మికుల కోసం చక్రం పెట్టారు. ఇలా చేసిన ఏకైన రాజకీయ పార్టీ టీడీపీనే.

**గత పాలకుల నిర్లక్ష్యంతో కార్మికులు రోడ్డున పడ్డారు..** గత పాలకుల నిర్లక్ష్యం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఇసుకను ఇతర రాష్ట్రాలకు బ్లాక్ లో తరలించారు. ఇసుక ద్వారా ప్రభుత్వానికి వచ్చే వేల కోట్ల ఆదాయాన్ని వదులుకుని మరీ ఇసుకను ఉచితంగా అందిస్తున్నాము. భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని ఉండాలి. భవనాలు కడితే వారికి ఉపాధి లభిస్తుంది. సంపద పెరుగుతుంది. భవిష్యత్ లో ఆదాయం వస్తుంది. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులు సులభతరం చేశాం. నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. నాలా చట్టాన్ని రద్దు చేశాం. 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో భవన నిర్మాణాలు చేస్తే సెల్లార్లకు అనుమతిచ్చాం. లే అవుట్ల రహదారుల కోసం 12 మీటర్ల నుంచి 9 మీటర్లకు తగ్గించాం. కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు గుంటూరు, శ్రీ సిటీలో 100 పడకలు, కర్నూలులో 30 పడకల ఆస్పత్రులు కడుతున్నాము.

**పింఛన్ తో పేదల జీవితాల్లో వెలుగులు..** మన దేశంలో ఒక్క పెన్షన్ల కిందే ప్రతి నెలా 64 లక్షల మందికి ఏడాదికి రూ. 33 వేల కోట్లు వెచ్చిస్తోంది ఏపీ ప్రభుత్వమే. ప్రతి రెండున్నర కుటుంబాల్లో ఒకరికి పింఛను ఇస్తున్నాం. కొందరి ఆదాయం కంటే పింఛనే ఎక్కువగా ఉంటోంది. గత ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ పింఛన్లు ఇచ్చారు. రూ. 200 పింఛన్లను రూ. 2 వేలు చేసింది నేనే. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3,000 పింఛను రూ 4,000 వేలు చేశాను. డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమ్మైన వారికి రూ. 15 వేలు పింఛను ఇస్తూ మానవత్వాన్ని నిరూపించుకున్నాం. జూన్ 1 నాటికి వెరిఫికేషన్ పూర్తి చేసి వితంతు పింఛన్లు అందిస్తాం.

**ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతి..** అమరావతి నిర్మాణంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అమరావతిలో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు భూమి ఇచ్చారు. రాజధాని మనకు అవసరం, అందులో మేము భాగస్వాములు అవుతామని రైతులు అన్నారు. మేమిచ్చిన భూమి అభివృద్ధి చేసి అందులో కొంత తిరిగి ఇవ్వాలని రైతులు అన్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా అమరావతి నిర్మాణం చేస్తూ ప్రజలను కోటీశ్వరులను చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత తెలుగుదేశానిదే . అమరావతిలో కాలేజీలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు వచ్చాయి. నేను ఏ ప్రాజెక్టు చేపట్టినా ఏ రైతుకు అన్యాయం జరగనివ్వలేదు. అభివృద్ధి సహించలేని వారి విమర్శలు నేను పట్టించుకోను. పోర్టు, ఎయిర్ పోర్టు , ఇండస్ట్రీ రావడం వల్ల ఆ ప్రాంతం అభివృద్ధి అవుతుంది. ఉద్యోగాలు వస్తాయి.

**ఇన్నోవేషన్ హబ్ గా అమరావతి..** త్వరలో అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయబోతున్నాం. ఆనాడు నేను ఐటీకి ప్రాధాన్యత ఇచ్చాను. మంచి ఉద్యోగాలు వచ్చాయి. ఇప్పుడు ఏఐ ని ప్రోత్సహిస్తున్నాను. భవిష్యత్ ఏఐదే . దాన్ని ఉపయోగించుకుంటే జీవితాలు బాగుపడతాయి. ఉత్తరాంధ్రకు విశాఖ కేంద్రంగా గోదావరి జిల్లాలకు రాజమండ్రి కేంద్రంగా, గుంటూరు, కృష్ణా జిల్లాలకు విజయ-వాడ కేంద్రంగా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు తిరుపతి కేంద్రంగా, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలకు అనంతపురం కేంద్రంగా రీజనల్ హబ్స్ పెడుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారే ఉన్నత స్థితి లో ఉన్నారు. ఉద్యోగం చేయడం కాదు...ఉద్యోగం ఇచ్చే పరిస్థితికి రావాలి.

**నెల్లూరు జిల్లా అభివృద్ధి బాధ్యత నాది...** నెల్లూరు జిల్లాలో తరతరాలుగా పేదరికంలోనే యానాదులు మగ్గుతున్నారు. వారిని ఆదుకుంటాం. సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం. రామాయపట్నంలో రూ. 95 వేల కోట్ల వ్యయంతో బీపీసీఎల్ రిఫైనరీ వస్తోంది. కావలి పక్కన దగదర్తి ఎయిర్ పోర్టు త్వరలో ప్రారంభిస్తాం. శ్రీ సిటీ ఇక్కడే ఉంది. రూ. 5 వేల కోట్ల వ్యయంతో ఎల్ జీ వస్తోంది. 10 వేల ఉద్యోగాలు కల్పిస్తారు. సీమను గ్రీన్ ఎనర్జీ హబ్ గా తయారుచేస్తాం. శ్రీశైలం నుంచి నీటిని ముందుగా సీమకు ఇచ్చింది ఎన్టీఆరే. సోమశిల , కందలేరుకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆరే. ఆత్మకూరులో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తాం.

**సూపర్ సిక్స్ తో పేదల జీవితాల్లో వెలుగులు..** రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ఇల్లు, మంచినీటి కుళాయి , మరుగుదొడ్లు, కరెంటు , దీపం కింద గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలన్నదే నా లక్ష్యం. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 200కు పైగా అన్నాక్యాంటీన్లు ఏర్పాటుచేశాం. దీపం 2 పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. మత్స్యకారులకు రూ. 20 వేలు వేశాం. 16,347 టీచరు పోస్టులు భర్తీ చేయబోతున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదిలో మూడు విడతల్లో రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం. జూన్ నాటికి తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేలు అందిస్తాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 270 సేవలు అందిస్తున్నాం. వాటిని 1000కి పెంచుతాం.

**బంగారు కుటుంబానికి ఎంపికైన జ్ఞానమ్మ మాట్లాడుతూ..** నాకు నలుగురు పిల్లలు ఉన్నారు. నా భర్త కూలీ పనులకు వెళ్లి మమ్మల్ని పోషిస్తున్నారు. కూలీకెళ్లని రోజున యాచించి పూట గడుపుకుంటాము. ఉండటానికి ఇల్లు లేదు. ఎవర్నైనా అప్పు అడిగితే మీకు ఏముందని తిరిగి అప్పు ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. నా పిల్లల్ని చదివించుకోవాలని నా కోరిక. నేను, నా భర్త చదువుకోలేదు. మాకు ఇల్లు కట్టించండి. సీఎం: జ్ఞానమ్మ నలుగురు బిడ్డలను ఆస్తిగా భావించాలి. ఆ నలుగురిని చదివిస్తే భవిష్యత్తులో బాగా రానిస్తారు. జ్ఞానమ్మ కుటుంబానికి ప్రభుత్వం తరపున స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తాం. మౌలిక వసతులైన నీరు, విద్యుత్, గ్యాస్, మరుగుదొడ్డి ఏర్పాటు చేస్తాం. నలుగురి పిల్లలకు కలిపి మొత్తం రూ.4 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేస్తాం. మార్గదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ నా చిన్నతనంలో మా నాన్న చనిపోతే మా అమ్మ కూరగాయలు అమ్మి నన్ను చదివించారు. పేదింటి కష్టాలు ఎలా ఉంటాయో నేను ప్రత్యక్షంగా చూశాను. 2020 విజన్ ద్వారా చాలా మంది జీవితాలు మారాయి. మద్రిపాడులో సాహెూ ఫౌండేషన్ ద్వారా 190 మంది తల్లి, తండ్రి లేని పిల్లలను దత్తత తీసుకుని చదివిస్తున్నాం. జ్ఞానమ్మ నలుగురు పిల్లలను చదివించే బాధ్యత నేను తీసుకుంటాను.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ




**మచిలీపట్నం,కలంకౌంటర్** : బందరు గాంధీ విద్యాలయ హై స్కూల్ లో విద్యార్థులకు "ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో సమాజం అధ్యక్షుడు తాడేపల్లి మెహెర్ బాబా, ప్రధాన కార్యదర్శి ఉడత్తు కిషోర్,గాంధీ విద్యాలయ కన్వీనర్ మాజేటి చక్రవర్తి,ఉపాధ్యాయుడు వెచ్చా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న సమాచార, గృహ నిర్మాణ శాఖ ల మంత్రి కొలుసు పార్థసారథి

-అమరావతి,కలంకౌంటర్ :

## వైభవంగా అమ్మవారి తిరునాళ్ల



**చందోలు (బాపట్ల జిల్లా),కలంకౌంటర్** : చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగలాముఖి అమ్మవారి వార్షిక తిరుణాల మహెూత్సవంలో భాగంగా రెండవ రోజు కార్యక్రమంలో కుంచలవారిపాలెం గ్రామానికి సంబంధించిన పెద్దలు చెంచు రెడ్డి రవిచంద్ర రెడ్డి వగైరా పెద్దలు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి తమ గ్రామానికి ఆహ్వానం పలుకుతూ స్వాగతం పలికారు .ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి కిరాత రూప వారాహి దివ్య అలంకారము లో అమ్మవారి అలంకరణ జరిగింది .ఆలయ పూజారులు 16 మంది భక్తిశ్రద్ధలతో పావన ఘటనలు శిరస్సున ధరించి గ్రామ ఊరేగింపు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ నరసింహామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.



## కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాను: జగన్

**తాడేపల్లి,కలంకౌంటర్** : ఆంధ్రప్రదేశ్ జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని వైసీపీ అధినేత జగన్ అన్నారు. 'కుల ఆధారిత జనాభా గణన నిర్వహించాలనే కేంద్రం నిర్ణయాన్ని నేను స్వాగతిస్తున్నాను. కుల ఆధారిత జనాభా గణన కేంద్రీకృత సంక్షేమ చర్యలను అనుమతిస్తుంది. వెనుకబడిన, అణగారిన వర్గాలకు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని నిర్ధారిస్తుంది' అని జగన్ ట్వీట్ చేశారు.

## కులగణనతో బీసీ వర్గాలకు న్యాయం

● కులగణన చేపట్టాలన్న కేంద్ర నిర్ణయం హర్షణీయం

కులగణనపై కేంద్ర నిర్ణయం చరిత్రాత్మక అడుగు : వీరంకి

**విజయవాడ, కలంకౌంటర్** : కులగణనతో బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి అభిప్రాయపడ్డారు. దేశంలో త్వరలో మొదలయ్యే జనాభా లెక్కల సేకరణతోపాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవటం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీపీఏ) సమావేశం దీనికి ఆమోదముద్ర వేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనతో బీసీ వర్గాలకు న్యాయం జరగనుందన్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలు తీయబోతున్నారని, స్వాతంత్ర్య వచ్చిన తర్వాత ఆరుసార్లు తీసిన జనాభా గణనలో కులాల వారీగా లెక్కలు తీయలేదని, కానీ, ఈసారి కులాల వారీగా జనాబా లెక్కలు వేసేందుకు నిర్ణయం తీసుకోవటం ముదావహమన్నారు.

## మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్** : వాసవి కపుల్స్ క్లబ్ ఆద్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో తమ్మన మధుసూదనరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అనగనగా ఆ లోయలో......

**ఆనాడు..**

ముద్దుకు మత్తెక్కించే పూల వనాలు
జిహ్వాకు జివ్వుమనిపించే ఆహారపు రుచులు.
వేదాన్ని నాదం లా వినిపించే పండితుల కంఠస్వరాలు.
అభిరుచుల సందడులు చేసే మంచు పల్లకీలు.
దివ్యత తో భాసిస్తు తపస్సులు చేస్తున్న వృక్షాలు.
మధుర మందిరాలను తీర్చిదిద్దే తివాచీల పచ్చికబయళ్ళు.
దేవతలు దిగివచ్చి జలకాలడే సరస్సులు.
మనుషుల జీవితాలు తీర్చిదిద్దే శివుని హిమ లింగాలు.
తియ్యటి రుచులతో జాలువారే సెలయెర్ల సవ్వడులు.
సరసాల సయ్యాటలాడే పిల్ల తెమ్మెరలు.
మత్తెక్కించే పూల పుప్పొడుల చప్పుళ్ళు.
ఆకాశాన్ని చుంబించే ఎత్తైన శ్రేణులు.
నిశ్శబ్దలను ఆలింగనం కావించే లోయలు.

**ఈనాడు..**

బాంబుల గంభీరాలకు వణుకుతున్న పూబంతులు.
కాశ్మీరు మంత్ర కంఠాలను తెగనరికిన తీతువు కూతలు.
మంచు నాలుకలపై రుధిరాన్ని పోస్తున్న క్షుద్ర శక్తులు.
పచ్చని పచ్చికలపై పిచ్చి పిచ్చిగా రక్తపుముగ్గులు వేస్తున్న జిహాదీలు.
ధం... అని పేలే గ్రానైడ్ లాంచర్లకు దిమ్మతిరుగుతున్న కొండల గుండెలు.
లోయలలో గన్ స్థావరాలను పొదివి పెట్టుకొన్న మాయ రావణాసురులు.
నిప్పుల కుంపటి పై జలధారలు ఎప్పుడు కురుస్తాయి.
నిండైన భారతం నుదిటిన పూర్ణ తిలకం ఎప్పుడు దిద్దుకొంటుంది.

**-గాదంశెట్టి. శ్రీనివాస్**

**ఉప్పుగుండూరు, ప్రకాశం జిల్లా.**

# డి సి ఎం ఎస్ చైర్మన్ బండికి ఘన సన్మానం







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బండి రామకృష్ణ డి సి ఎం ఎస్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా గజమాలతో ఘన సన్మానం చేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్,తెలుగు యువత రాష్ట్ర నాయకుడు హసీం బేగ్ ,మాదిరెడ్డి శ్రీను తదితరులు.

# వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం ఉదయపు నడక మిత్ర మండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక డైమండ్ బజార్ లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షుడు జల్లు మురళీ నాథ్,జోనల్ చైర్మన్ కారుమూరి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బండికి బీజేపీ నాయకులు సన్మానం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణ కి కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా నియామకం అయిన శుభ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందన తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు ,కృష్ణ జిల్లా నాయకులు తోట రంగనాథ్ ,చలమల శెట్టి రామకృష్ణ ,వేములపల్లి వెంకటరమణ, పంతం మణికంఠ తదితరులు.



# బండి కి శుభాకాంక్షలు తెలిపిన కొల్లు, కొనకళ్ల



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ బండి రామకృష్ణ ను సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంచలంచలుగా ఎదిగిన నాయకుడు బండి రామకృష్ణ అని కూటమి ధర్మానికి కట్టుబడి జనసేన పార్టీ మచిలీపట్నం ఇన్చార్జిగా పార్లమెంటు ఎన్నికల నిర్వహణ కార్యదర్శిగా పార్టీ కూటమి అభ్యర్థుల గెలుపు కు కృషి చేశారని తెలిపారు. కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా రైతులకు సేవ చేసే చక్కటి అవకాశాన్ని లికూటమి ప్రభుత్వంలిబండి రామకృష్ణలికు కల్పించడం హర్షించదగ్గ విషయమని అన్నారు.రామకృష్ణ ఆ పదవికి వన్నెతెస్తారనిలి వారు అభిలాషించి తమ సహకారం తో పాటు ప్రభుత్వపరంగా కావలసిన సహకారాన్ని అందిస్తామని రైతు సంక్షేమం కొరకు పాటుపడాలని కోరారు.రామకృష్ణ మాట్లాడుతూలి కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మీ అందరి సహకారంతో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతు సాధక బాధలు తెలుసునని రైతుకు లాభసాటి గా ధరలు ఉండేలా కృషి చేస్తానని పేర్కొన్నారు .అభినందనలు తెలిపిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారులి. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డంరాజు , కూటమి ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మేడే వేడుకలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16వ డివిజన్ ఐదు రోడ్లు సెంటర్ లో , నవచైతన్య మచిలీపట్నం ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. చికాగో నగరంలో శ్రామికుల శ్రమదోపిడి నియంత్రణ కోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్స్ కి నివాళులర్పించారు. రెండు యూనియన్ల గౌరవ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మరియు మచిలీపట్నం టౌన్ ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు ఎల్ఐసి విశ్రాంత డెవలప్మెంట్ ఆఫీసర్ పేర్ని సుబ్రహ్మణ్యం పెట్రోల్ బంక్ యజమాని రమేష్, ఎమరాల్డ్ బ్యాటరీ ఏజెంట్ రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మచిలీపట్నం టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 55 మంది మెకానికులకు గుర్తింపు కార్డులను లంకిశెట్టి బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కొల్లా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వ పరంగా అర్హులైన మెకానికులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, ఇన్సూరెన్స్ అందించడానికి రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర హామీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. 10 లక్షల మంది మెకానికులు ఉన్న ఆంధ్రప్రదేశ్లో మెకానికల్ సంక్షేమం కోసం రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సుబ్బారావు కోరారు. చలరాస్తా సెంటర్లో జరిగిన ఆటో యూనియన్ వర్కర్ల సమావేశంలో లంకిశెట్టి బాలాజీ, ట్రాఫిక్ ఎస్.ఐ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు నిదానంగా డ్రైవింగ్ చేయాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, ఇన్సూరెన్స్ ఫోర్సులో ఉండాలని, అపరిచితుల నుండి వాహనాలు కొనుగోలు చేయకూడదని తెలియజేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం చట్టరీత్యా చెల్లదని తెలియజేశారు. ఆటో యూనియన్ అధ్యక్షులు నాగరాజు కార్యదర్శి పిట్టు భాగ్యారావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎర్రజెండాను లంకిశెట్టి బాలాజీ ఆవిష్కరించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో మల్లంపల్లి వీర వెంకట రామాంజనేయులు బాబు తాడేపల్లి రమేష్ ఇతర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో మేడే





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మే డే దినోత్సవాన్ని మచిలీపట్నంలో ఏఐటియుసి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు తొలుత సిపిఐ కార్యాలయంలో మేడే పతాకాన్ని నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ ఆవిష్కరించారు .తదుపరి బలరాముని పేటలోని కామ్రేడ్ కొరక అచ్చయ్య స్తూపం వద్ద పరాకాన్ని ఒంటి పులి లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రూపం వద్ద సీనియర్ కామ్రేడ్ ఆవిష్కరించారు . ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ స్థూపం వద్ద ఆర్టీసీ కార్గో నాయకుడు దుర్గారావు పాల్గొన్నారు.

# కే డి సి సి బ్యాంకు చైర్మన్ 'నెట్టెం ను కలిసిన గోపు



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన మాజీ మంత్రి నెట్టెం రఘురాంను గురువారం కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా 'గోపు' మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో విశిష్ట కృషిచేసిన రఘురాం కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ లు తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. టిడిపిలో కష్టపడే వారికి జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి నాయకులుగా తెలుగుదేశం పార్టీ గుర్తిస్తుందని అన్నారు. వీరితోపాటు ఉపాధ్యక్షులు వేముల శివాజీ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పామర్తి లక్ష్మణ్, తెలుగు రైతు టౌన్ సెక్రటరీ బడే రమణ కలిసి వారిని సముచిత రీతిలో సత్కరించారు.

# స్నేహశీలికి శుభాకాంక్షలు వెల్లువ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రముఖ గోల్డ్ వ్యాపారి ఉడత్తు సురేష్ జన్మదినోత్సవం సందర్భంగా గోల్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రా శ్రీనివాస కుమార్ ఆద్వర్యంలో,నగర ఆర్యవైశ్య సమాజం ఆద్వర్యంలో,మిత్ర బృందం ఆద్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో రవికుమార్,సామా కాంతారావు,ఉదయగిరి మురళీ,కొప్పర్తి రవి శంకర్, జయవ రపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా మే డే వేడుకలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా 16వ డివిజన్లో కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఏర్పాటు చేసిన జెండాను మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ ఎగురవేశారు .ఈ సందర్భంగా కార్మికులకు స్వీట్లు కండువాలు పంపిణీ చేసి కర్షక కార్మిక లోకానికిలిమేడే శుభాకాంక్షలు తెలిపారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com